సాక్షి కర్నూలు

గురువారం । 25 । జూలై । 2024



సాఫల్యం.. వైఫల్యం

సంతానలేమి సమస్యతో బాధపడే వారి సంఖ్య ఇటీవల కాలంలో అధికమైంది. వీరి కోసం ఉమ్మడి కర్నూ లు జిల్లాలో సంతాన సాఫల్య కేంద్రాలు వెలుస్తున్నాయి. 8లో▸



శ్రీశైలంలో ఆషాఢ బోనాలు

శ్రీశైలంటెంపుల్: క్షేత్ర పరిధిలోని యోగినిమాత ఆధ్యాత్మిక సేవా ఆశ్రమంలో తెలంగాణ, కర్ణాటక భక్తులు మహిషాసుర మర్దిని అమ్మవారికి ఆషాడ బోనాలు నైవేద్యంగా సమర్పించారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,632
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:103
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:87,700
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:18,686

న్యూస్‌రీల్

కేఎంసీలో 15 మంది విద్యార్థుల డిటెన్షన్

- తరగతులకు గైర్హాజరు, సబ్జెక్టుల్లో ఫెయిల్ కావడమే కారణం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ అభ్యసిస్తున్న 15 మంది వైద్య విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టినరసమ్మ డిటెన్షన్ చేశారు. నేషనల్ మెడికల్ కౌన్సిల్ నిబంధనల మేరకు తరగతులకు తగిన శాతం మేరకు హాజరు కాకపోయినా, పరీక్షల్లో ఫెయిల్ అయినా అలాంటి విద్యార్థులను డిటెన్షన్ చేయాలని ఉంది. ఈ మేరకు అనాటమి, ఫిజియాలజీ విభాగాల ఆచార్యుల ఫిర్యాదు మేరకు ప్రథమ సంవత్సరం చదువుతున్న 15 మంది విద్యార్థులను అధికారులు డిటెన్షన్ చేశారు. ఈ కారణంగా సదరు విద్యార్థులు మళ్లీ మొదటి సంవత్సరం చదవాల్సి ఉంటుంది. వీరి డిటెన్షన్ ఎత్తేయాలని తల్లిదండ్రులు అధికారులను కోరారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల ద్వారా ఒత్తిళ్లు కూడా చేయిస్తున్నారు. అయితే హాజరు విధానం బయోమెట్రిక్, ఫేస్ రికగ్నేషన్ సిస్టమ్‌లో ఉండటంతో నేరుగా ఎన్ఎంసీలో ఆన్‌లైన్ ద్వారా నమోదవుతుంది. దీనివల్ల ఆటోమేటిక్‌గా ఇలాంటి విద్యార్థులపై చర్యలు తీసుకోవాల్సి ఉంటోందని ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టినరసమ్మ తెలిపారు. ఇదిలాఉంటే ఈ విధానం గురించి అధికారులు, ఆచార్యులు విద్యార్థులకు మొదటి నుంచి చెప్పకపోవడం వల్లే వారు నిర్లక్ష్యంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయమై పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు కోర్టును ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.

అసాంఘిక శక్తులపై నిఘా

- ఎస్పీ బిందు మాధవ్



పోలీస్ సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ

ఆలూరు: ప్రజల హక్కులకు భంగం కల్గిస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై ప్రత్యేకంగా నిఘావేసి కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఎస్పీ బిందు మాధవ్ ఆదేశించారు. స్థానిక పోలీసు సర్కిల్ కార్యాలయాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ సర్కిల్ కర్ణాటక రాష్ట్రానికి సరిహద్దులో ఉందని, నేరగాళ్లపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో నాటుసారా తయారీ అరికట్టాలన్నారు. మట్కా, పేకాట, గంజాయిపై ఉక్కుపాదం మోపాలన్నారు. కర్ణాటక మద్యం అక్రమరవాణాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్పీ వెంట ఆలూరు సీఐ బి. వెంకటేశ్వర్లు, ఎస్ఐ ఓబులేసు ఉన్నారు.



రూ. 4 లక్షల అప్పు చేశాం

మాకు సొంత భూమి 10 ఎకరాలు ఉంది. మరో 30 ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తి, వేరుశనగ, కొర్ర, సజ్జ, కంది పంటలు సాగు చేస్తున్నాం. రబీలో తుగ్గలి మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించారు. అయితే ఇప్పటి వరకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వలేదు. పంటల బీమా పరిహారం కూడా విడుదల చేయకపోవడంతో చానా ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటి వరకు సాగుకోసం రూ.4లక్షలు అప్పు చేశాం. కూటమి ప్రభుత్వం రైతుకు ఏటా రూ.20వేల పెట్టుబడి సాయం అందిస్తామని హామీ ఇచ్చినా ఇప్పటి వరకు పట్టించుకోలేదు.

– గిరిగిట్ల హనుమంతు, తుగ్గలి



సరైన వర్షాలు లేక వాడుముఖం పట్టిన పత్తి పైరు

భూమి పదునెక్కదు.. సాగుకు సాయమందదు!

సాధారణ సాగు **4.19** లక్షల హెక్టార్లు | ప్రస్తుత సాగు **1.36** లక్షల హెక్టార్లు

రైతులు పట్టని కూటమి ప్రభుత్వం

- ఊసేలేని వేరుశనగ మినీ కిట్ల పంపిణీ
- ప్రాధాన్యత కోల్పోయిన పొలంబడి
- ఆర్‌బీకేలను నిర్వీర్యం చేసే దిశగా అడుగులు
- జూన్ 15 తరువాత కనుమరుగైన రుతుపవనాలు
- దాదాపుగా అన్ని ప్రాంతాల్లో ఒక మోస్తరు వర్షాలే
- ఖరీఫ్‌లో 50 రోజులు దాటినా సాగులో పురోగతి కరువు

కర్నూలు(అగ్రికల్చర్): అన్నదాత సుఖీభవ అనేది మాటల్లో తప్ప చేతల్లో కనిపించడం లేదు. ప్రభావం చూపని రుతుపవనాలు, వ్యవసాయంపై ప్రభుత్వం శీతకన్ను వేయడం రైతులను నిరుత్సాహానికి గురిచేస్తోంది. ఎన్నికలకు ముందు సూపర్ 6 పథకాలతో ఊరించిన టీడీపీ, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి ఊసే మరుస్తోంది. ముఖ్యంగా రైతులకు గ్రామస్థాయిలోనే అన్ని రకాల సేవలు అందించే రైతు సేవా కేంద్రాలు(ఆర్‌బీకేలు) నిర్వీర్యం అవుతున్నాయి. ఈ ఏడాది ముందస్తుగా రుతుపవనాలు విస్తరించాయి. జూన్ నెల మొదటి పక్షం వరకు వర్షాలు ఊరించాయి. తర్వాత వర్షాలు తగ్గిపోవడంతో ఖరీఫ్‌పై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. జూన్ నెలలో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదైనప్పటికీ రెండవ పక్షం నుంచి చినుకు జాడ లేకపోవడం పంటలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. వర్షాభావం వల్ల ఇప్పటికే ఒకే పొలంలో రెండు, మూడు సార్లు విత్తనం వేసిన రైతులు వేలాదిగా ఉన్నారు. అదునులో విత్తనం వేసుకోవాలనే లక్ష్యంతో అంతంత మాత్రం తేమలోనే వేరుశనగ, పత్తి, కంది, ఆముదం, మొక్కజొన్న వంటి పంటలు వేశారు. అయితే మొలకలు రాకపోవడంతో మళ్లీ విత్తనాలు విత్తుకున్నారు. ఇలాంటి పరిస్థితులు దాదాపు అన్ని మండలాల్లో ఉండటం గమనార్హం. ఇందువల్ల పెట్టుబడి వ్యయం పెరిగిపోతోంది.

జూలైలో అంతంత మాత్రం వర్షాలే..

వ్యవసాయానికి జూలై నెల అత్యంత కీలకం. వివిధ పంటల సాగుకు జూలై వరకే అవకాశం ఉంటుంది. ఖరీఫ్ సీజన్ జూన్ ఒకటి నుంచి మొదలైంది. దాదాపు 50 రోజులు దాటినా రెండు, మూడు మండలాలు మినహా మిగిలిన మండలాల్లో వర్షాలు తేలికపాటి నుంచి ఒక మోస్తరుకే పరిమితం అయ్యాయి. జూలై సాధారణ వర్షపాతం 90.7 మి.మీ ఉండగా 21 రోజుల్లో 54.8 మి.మీ మాత్రమే నమోదైంది. జూలై నెలలో 40 శాతం లోటు వర్షపాతం ఉండటం గమనార్హం. చిప్పగిరిలో 77 శాతం, హొళగుందలో 75, ఓర్వకల్‌లో 62, ఆదోని 62, ఆస్పరిలో 61, పత్తికొండలో 53, హాలహర్విలో 58, ఆలూరులో 56, పెద్దకడుబూరులో 48, గూడూరులో 44 శాతం ప్రకారం లోటు వర్షపాతం ఉంది. వర్షానికి, వర్షానికి వ్యత్యాసం 21 రోజులు ఉంటే ఒక డ్రై స్పెల్‌గా వ్యవహరిస్తారు. అయితే అడపాదడపా తేలికపాటి వర్షాలు పడుతుండటంతో డ్రై స్పెల్‌లు లేవని వ్యవసాయ అధికారులు స్పష్టం చేస్తున్నారు. జిల్లాలో దాదాపు నెల రోజులుగా వర్షాలు లేవు. ఉన్నా తేలికపాటికే పరిమితం అవుతుండటంతో పంటల్లో ఎదుగుదల లోపించింది.



ఎదుగుదల లేని జొన్న పైరు

రైతులను చుట్టుముట్టిన సమస్యలు

- వర్షాలు లేకపోవడం వల్ల పంటలు దెబ్బతింటున్నాయి. తేలికపాటి వర్షాలు పడుతుండటం వల్ల పంటల్లో పచ్చదనం ఉన్నప్పటికీ ఎదుగుదల లోపించింది. దీంతో ఖరీఫ్‌పై రైతుల ఆశలు సన్నగిల్లుతున్నాయి.
- రైతులకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం కరువైంది. టీడీపీ కూటమి రైతులకు అన్నదాత సుఖీభవ కింద ఏడాదికి రూ.20 వేలు పెట్టుబడి సాయం అందిస్తామని ప్రకటించింది. కానీ ఆ దిశగా ఎలాంటి చర్యలు లేవు.
- ఏప్రిల్ 1 నుంచి ఖరీఫ్ పంట రుణాలు పంపిణీ చేయాల్సి ఉంది. కాని ఇప్పటి వరకు పంట రుణాల పంపిణీ రూ.600 కోట్లకు మించకపోవడం గమనార్హం.
- రైతుభరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా మార్పు చేసినప్పటికీ.. వీటి ద్వారా రైతులకు సేవలు అందని పరిస్థితి ఏర్పడింది.
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో అన్ని సేవలకు కేరాఫ్‌గా నిలిచిన రైతు భరోసా కేంద్రాలను ప్రస్తుత ప్రభుత్వం పక్కన పెట్టడం విమర్శలకు తావిస్తోంది.
- గత వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం రూపాయి ప్రీమియం లేకుండా ఉచిత పంటల బీమాను అమలు చేసింది. కూటమి ప్రభుత్వం ఉచిత పంటల బీమాకు మంగళం పలికింది. 2018–19 వరకు ఉన్న తరహాలోనే పంటల బీమాకు రైతులు డబ్బు చెల్లించాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది.
- 2023 ఖరీఫ్ పంటల బీమా పరిహారం కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. 2023 ఖరీఫ్‌లో ఉచిత పంటల బీమా అమలులో ఉంది.
- ప్రతి ఏటా వేరుశనగ మినీకిట్లు రైతులకు ఉచితంగా పంపిణీ చేయడం జరిగేది. 2023–24లో కూడా దాదాపు 800 మినీ కిట్లు పంపిణీ చేశారు. 2024 ఖరీఫ్‌లో మాత్రం కూటమి ప్రభుత్వం వీటి పంపిణీని పక్కన పెట్టింది.
- పొలంబడి కార్యక్రమాలను కూడా కూటమి ప్రభుత్వం నామమాత్రం చేసింది. గత ఏడాది వరకు ఆర్‌బీకే వారీగా ఆహార, వాణిజ్య పంటల్లో పొలంబడులు నిర్వహించగా.. నేడు మండలానికి ఒకటి మాత్రమే పొలంబడి నిర్వహించేలా ఆదేశాలు ఇవ్వడం గమనార్హం.

కోలుకోని పంటలు

ఖరీఫ్ సాధారణ సాగు 4,19,221 హెక్టార్లు ఉండగా, ఖరీఫ్ మొదలై 50 రోజులు దాటినప్పటికీ సాగులో పురోగతి కరువైంది. ఇప్పటి వరకు కేవలం 1,36,526 హెక్టార్లలో మాత్రమే పంటలు సాగయ్యాయి. ఇందులో అత్యధికంగా పత్తి 86,146 హెక్టార్లలో సాగయింది. ఆ తర్వాత వేరుశనగ 20964 హెక్టార్లలో.. కంది 13,184, మొక్కజొన్న 2,197, ఉల్లి 3,120, ఆముదం 2,311, సజ్జ 3,087, మిర్చి 1,272 హెక్టార్లలో సాగయ్యాయి. అయితే వర్షాలు లేకపోవడం వల్ల పంటలు దెబ్బతింటున్నాయి. ఈ సమయానికి వ్యవసాయశాఖ అంచనాల ప్రకారం 50 శాతం పైగా పంటలు సాగు కావాల్సి ఉంది. అయితే 1.36 లక్షల హెక్టార్లకే సాగు పరిమితం కావడం, ఇందులో కూడా 50శాతం పంటలు దెబ్బతినడంతో రైతుల ఆందోళన వర్ణనాతీతం.

వేరుశనగ సాగుకు అదును పూర్తయినట్లే..

జిల్లాలో వేరుశనగ సాధారణ సాగు 58,969 హెక్టార్లు ఉంది. ఇప్పటి వరకు 20,964 హెక్టార్లలో సాగు చేశారు. వ్యవసాయశాఖ సమాచారం ప్రకారం వేరుశనగకు ఈ నెల 20 వరకే అదును ఉంటుంది. అదును కూడా దాటుతుండటంతో వేరుశనగ సాగు ప్రశ్నార్థకం అవుతోంది. అదును తర్వాత సాగు చేస్తే చీడపీడల సమస్యలు ఎక్కువగా ఉంటుంది. ఈ ఏడాది సబ్సిడీపై పంపిణీ చేసిన వేరుశనగకు డిమాండ్ పెరిగింది. జిల్లాలో 40 శాతం సబ్సిడీపై దాదాపు 13,500 క్వింటాళ్ల వేరుశనగ పంపిణీ చేశారు. ఖరీఫ్ ఆరంభంలో వర్షాలు విస్తారంగా పడుతుండటంతో రైతుల్లో పంటలపై ఆశలు పెరిగాయి. వేరుశనగకు డిమాండ్ పెరగడంతో అదనంగా 5వేల క్వింటాళ్ల సబ్సిడీపై పంపిణీ చేసేందుకు అనుమతించాలని జిల్లా యంత్రాంగం ప్రతిపాదనలు పంపింది. ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో రైతులు బహిరంగ మార్కెట్‌లో వేరుశనగ కొనుగోలు చేసి సిద్ధం చేసుకున్నారు.

సాగు ఖర్చులు పెరిగిపోయాయి



వర్షాభావ పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయి. మాకు ఏడు ఎకరాల భూమి ఉంది. ఖరీఫ్ ఆరంభంలో పత్తి సాగు చేశాం. విత్తనాలు మొలకెత్తకపోవడంతో మళ్లీ ఆముదం, వేరుశనగ వేసుకున్నాం. ఇందువల్ల సాగు ఖర్చులు విపరీతంగా పెరిగాయి. ఇప్పటి వరకు తేలికపాటి వర్షాలే కురుస్తున్నాయి. 2023 ఖరీఫ్ పంటల బీమా పరిహారంతో పాటు రబీ ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేస్తే కొంతైనా ఉపశమనం కలుగుతుంది.

– రంగడు, ముక్కెళ్ల, తుగ్గలి మండలం

చంద్రబాబు ఇప్పుడేమీ మాట్లాడటం లేదు



ఇప్పటి వరకు పంటలకు ఉపయోగపడే వర్షాలు లేవు. మాకున్న ఆరు ఎకరాల్లో ఉల్లి, కొర్ర, కంది సాగు చేశాం. ఎన్నికల సమయంలో సూపర్-6లో భాగంగా రైతులకు ఏడాదికి రూ.20 వేల పెట్టుబడి సాయం అందిస్తామని కూటమి నేతలు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన చంద్రబాబునాయుడు ఇప్పటి వరకు ఆ మాటే మాట్లాడటం లేదు. రైతుల పరిస్థితి ఏమీ బాలేదు. ప్రభుత్వం ఆదుకుంటుందనే నమ్మకం సన్నగిల్లుతోంది.

– వై.ఎల్లనాగన్న, పెద్దటేకూరు, కల్లూరు మండలం

చదువుల తల్లికి ఎంత కష్టం



పత్తి పొలంలో విద్యార్థిని బోయ సింధు

చదువుకోవాలని ఆశ ఉన్నా.. అందుకు కుటుంబ పరిస్థితులు సహకరించడం లేదు. దీంతో ఆ బాలిక వారంలో నాలుగు రోజులు పనికి వెళ్తోంది. మూడు రోజులు బడికి వెళ్తూ శ్రద్ధగా చదువుకుంటోంది. గోనెగండ్ల మండలం చిన్నమరివీడు గ్రామానికి చెందిన బోయ సింధు.. గ్రామంలోని ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. తల్లిదండ్రులు బోయ పార్వతి, బోయ గోవిందులకు ఇల్లు తప్ప ఏమీ లేదు. వీరు రోజూ కూలీ పనులకు వెళ్తూ జీవనం సాగిస్తున్నారు. ఇల్లు గడవడం కష్టంగా ఉండటంతో వీరికి తోడుగా సింధు పొలం పనులకు వెళ్తోంది. తాము చాలా పేదరికంలో ఉన్నామని, బతుకు దెరువు కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినప్పుడు బిడ్డపై బెంగగా ఉంటుందని బోయ పార్వతి, గోవిందు తెలిపారు. బిడ్డ చదువుకు ఇబ్బంది లేకుండా అధికారులు కేజీబీవీలో సీటు ఇప్పించాలని వీరు కోరుతున్నారు.

– గోనెగండ్ల

వచ్చే ఏడాదికి మెడికల్ కాలేజీ పూర్తి

- జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా

ఆదోని రూరల్: వచ్చే విద్యా సంవత్సరంలోపు మెడికల్ కళాశాల నిర్మాణాలు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా ఆదేశించారు. పట్టణ సమీపంలోని మెడికల్ కళాశాల నిర్మాణ పనులను బుధవారం జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కళాశాలకు సంబంధించి అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ రెండు విభాగాలు పూర్తయ్యాయన్నారు. హాస్టళ్లలో ఒకటి పూర్తికాగా, ఇంకొకటి పైకప్పు స్థాయి వరకు వచ్చిందన్నారు. కళాశాలకు అవసరమైన నీటి సరఫరా కోసం రూ.30 కోట్లతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి సమర్పించామని, అనుమతులు రావాల్సి ఉందన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా, సబ్ కలెక్టర్ శివనారాయణశర్మ కళాశాల ఆవరణలో మొక్కలను నాటారు.

మెరుగైన సేవలు అందించాలి

సచివాలయల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సిబ్బందిని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. బుధవారం మండలంలోని నాగలాపురం గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. విలేజ్ క్లినిక్ ద్వారా అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం రుచి చూశారు. కట్టెల పొయ్యి మీద వంటలు చేయడాన్ని గమనించి గ్యాస్ స్టవ్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారిని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు. గ్రామంలో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరాపై ఆరా తీశారు. జిల్లా కలెక్టర్ స్వయంగా కుళాయి నీటిని పట్టుకుని తాగి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో అన్నిశాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ, ఆదోని తహసీల్దార్ హసీనాసుల్తానా, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, డీఈఓ శామ్యూల్, డీపీఓ నాగరాజునాయుడు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



మెడికల్ కళాశాల నిర్మాణ ప్రాంతంలో పర్యటిస్తున్న జిల్లా కలెక్టర్

ఖాకీ పోస్టింగ్‌లకు ఖద్దరు బేరం

ఎన్నికలు ముగిసి నెలన్నర రోజుల పైనే

- ఇప్పటికీ పోలీసుల బదిలీలపై స్పష్టత కరువు
- ప్రజాప్రతినిధుల లెటర్ ఉంటేనే పోస్టింగ్
- ఇప్పటికే బేరసారాలు సాగిస్తున్న నేతలు
- ఆదాయ వనరుల స్టేషన్‌లకు డిమాండ్
- ముగ్గురు నుంచి నలుగురు పోటాపోటీ

కర్నూలు: కొత్త ప్రభుత్వం కొలువు దీరిన నాటినుంచి కర్నూలు రేంజ్ పరిధిలోని పోలీసు అధికారులు బదిలీల కోసం ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. పలువురు డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు తమకు అనుకూలమైన స్థానాల కోసం ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. నేడో రేపో బదిలీలు ఖాయమని ప్రచారం జరుగుతున్నప్పటికీ అడుగు మాత్రం ముందుకు పడటం లేదు. జిల్లాకు చెందిన కొందరు ప్రజాప్రతినిధులు డబ్బు తీసుకుని పోస్టింగుల కోసం లేఖలు ఇస్తున్నారనే ఫిర్యాదుల నేపథ్యంలో క్షేత్రస్థాయి పరిశీలన తర్వాతే చేపట్టాలనే నిర్ణయానికి అధికారులు వచ్చినట్లు చర్చ జరుగుతోంది. జిల్లాలో నాలుగు పోలీస్ సబ్ డివిజన్లు ఉన్నాయి. ఆయా సబ్ డివిజన్లకు కొత్త అధికారులను నియమించేందుకు రంగం సిద్ధమైంది. అయితే ఈ విషయంలో జిల్లా నేతలు ప్రతిపాదించిన అధికారుల పూర్వ చరిత్రను క్షుణ్ణంగా పరిశీలించాకే బదిలీలు చేపట్టాలనే ఆలోచనతో కసరత్తు జరిపినట్లు తెలుస్తోంది. కర్నూలుకు బాబు ప్రసాద్, యుగంధర్ బాబు, భక్తవత్సలం, పత్తికొండకు శ్రీనివాసులు, వెంకటరామయ్య, ఎమ్మిగనూరుకు శ్రీనివాసులు, మురళీధర్ పోటీ పడుతున్నట్లు పోలీసు అధికారుల్లో చర్చ కొనసాగుతోంది.



పైరవీలకే ప్రాధాన్యత

- రేంజ్ పరిధిలో సీఐల బదిలీల హడావుడి రెండు వారాలుగా కొనసాగుతోంది.
- వాస్తవానికి పనితీరు, గతంలో కేసులు పరిష్కరించిన వైనం, రివార్డులు, అవార్డులు, చార్జిమెమోలు.. ఇలా అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని పోస్టింగులు ఇస్తుంటారు.
- వీటన్నింటితో పాటు స్థానిక ప్రజాప్రతినిధి సిఫారసు, సామాజిక సమీకరణాలకు ప్రాధాన్యత ఇచ్చేలా బదిలీలకు తెర లేచినట్లు సమాచారం.
- జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు ఇప్పటికే సీఐల పోస్టింగుల కోసం ఉన్నతాధికారులకు సిఫారసు లేఖలు ఇచ్చేందుకు అంగీకరించినట్లు తెలుస్తోంది.
- అయితే అధికారుల బదిలీలను ప్రజాప్రతినిధులు ఆదాయ వనరుగా మలుచుకున్నారనే చర్చ జరుగుతోంది.
- సీఐ పోస్టుకు రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షలు, అత్యంత ఆదాయ వనరులున్న పోలీస్ సర్కిల్‌కు స్పెషల్ రేటు ఉన్నట్లు పోలీసు వర్గాల్లో ప్రచారం ఉంది.

కర్నూలులోని ఆరు స్టేషన్లకు అత్యధిక డిమాండ్

కర్నూలులోని వన్, టూ, త్రీ, ఫోర్త్ పోలీస్ స్టేషన్‌లతో పాటు కర్నూలు అర్బన్ తాలూకా, కర్నూలు రూరల్ తాలూకా పోలీస్‌స్టేషన్లకు అత్యంత డిమాండ్ ఉంది. ఒక్కో స్టేషన్‌కు సగటున ముగ్గురు నుంచి ఐదుగురు ఆశావహులు ప్రయత్నాల్లో ఉన్నారు. అయితే కర్నూలు వన్‌టౌన్‌కు రామయ్య నాయుడు, టూటౌన్‌కు పవన్ కుమార్, త్రీటౌన్‌కు నాగరాజ రావు, ఫోర్త్ టౌన్‌కు మధుసూదన్, కర్నూలు ట్రాఫిక్‌కు అబ్దుల్ గౌస్, తాలూకా రూరల్‌కు చంద్రబాబు నాయుడు, తాలూకా అర్బన్‌కు మహేశ్వరరెడ్డి పేర్ల పరిశీలనలో ఒక స్పష్టత వచ్చినట్లు సమాచారం. అలాగే ఎమ్మిగనూరు టౌన్‌కు విక్రమసింహ, ఎమ్మిగనూరు రూరల్‌కు మంజునాథ్ పేర్లు ప్రచారంలో ఉన్నాయి. మద్యం, రేషన్ బియ్యం, ఇసుక, ఎర్రమట్టి తదితర ఆదాయ వనరులు ఉన్న మరికొన్ని స్టేషన్లకు కూడా డిమాండ్ ఉంది.

మాకూ కావాలి స్టేషన్..

ఎన్నికలకు ముందు ఏఎస్ఐలకు ఎస్ఐలుగా పదోన్నతి ఇచ్చి పొరుగు జిల్లాలకు బదిలీ చేశారు. తాజాగా వారంతా జిల్లాకు వస్తున్నారు. వీరు కూడా స్టేషన్ పోస్టింగుల కోసం నేతలను ఆశ్రయిస్తున్నారు. ఆదోని, కోడుమూరు నియోజకవర్గాలకు సంబంధించి సీఐలు, ఎస్ఐలు ఎవరిని నియమించాలనే విషయంలో ఆయా నియోజకవర్గాల ప్రతినిధులు ఒక నిర్ణయానికి వచ్చి లేఖలు ఇచ్చేందుకు అంగీకరించినట్లు పోలీసు వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే లేఖలు ఇచ్చేందుకు కొన్ని నియోజక వర్గాల్లో భారీగా బేరసారాలు సాగిస్తుండటం గమనార్హం.

అనాథ పిల్లలకు ఐసీడీఎస్ అండ

హాలహర్వి: అనాథ పిల్లల పోషణ, చదువులకు ఐసీడీఎస్ అండగా ఉంటుందని ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటలక్ష్మమ్మ తెలిపారు. మండలంలోని గూళ్యం గ్రామంలో తల్లిదండ్రుల లేక అనాథలైన పిల్లల స్థితిగతులను ఆమె అడిగి తెలుసుకున్నారు. వారి బంధువుల అంగీకారం మేరకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో వారి పోషణ, చదువులు తదితర వాటిని చూసుకుంటామన్నారు. అనాథ బాలిక ఆసాబీ దివ్యాంగురాలు కావడంతో పింఛన్ మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీడీపీఓ మద్దమ్మ, సూపర్‌వైజర్ చందన పాల్గొన్నారు.

క్లుప్తంగా

అప్పుల బాధతో యువరైతు ఆత్మహత్య


మృతి చెందిన చక్రవర్తి ఆచారి

కృష్ణగిరి: అప్పుల బాధతో ఉరివేసుకుని ఓ యువరైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మంగళవారం రాత్రి పోతుగల్లు గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ ఖాజావలి తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన రమణయ్య ఆచారి, మహేశ్వరమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం. ఇద్దరు కుమారుల పేరు మీద ఉన్న ఆరు ఎకరాల పొలాన్ని సాగు చేసుకుంటూ గ్రామంలో చిన్న బంక్ పెట్టుకుని కిరాణం సరుకులు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. పెళ్లిళ్లు, పంట సాగుల కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలని, ఈ యేడాది కూడా వర్షాలు అంతంత మాత్రమే గానే ఉన్నాయని చిన్న కుమారుడు చక్రవర్తి ఆచారి(27) తల్లిదండ్రులతో బాధపడుతుండేవాడు. మంగళవారం రాత్రి భోజనం చేసిన తర్వాత ఇంట్లో పైకప్పుకు చీరతో ఉరి వేసుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు కోడుమూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందాడు.. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి భార్య లహరి, కుమార్తె ఉన్నారు.

విద్యుదాఘాతంతో న్యాయవాది మృతి


న్యాయవాది శివరామ్(ఫైల్)

బొమ్మలసత్రం: విద్యుదాఘాతంతో ఓ న్యాయవాది మృతిచెందాడు. బంధువులు తెలిపిన వివరాలు.. వెలుగోడుకు చెందిన శివరామ్(32) లా పూర్తి చేసి, కొంత కాలం హైదరాబాద్, కర్నూలు కోర్టుల్లో ప్రాక్టీస్ చేశాడు. ఏడాది క్రితం నంద్యాలలోని నూనెపల్లిలో ఇల్లు అద్దెకు తీసకుని సీనియర్ల వద్ద పనిచేస్తున్నాడు. ఈనెల 21న స్నానం చేసేందుకు బాత్‌రూమ్‌లోకి వెళ్లిన శివరామ్ వాటర్ హీటర్ తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడిక్కడే మృతిచెందాడు. దుర్వాసన వస్తుండటంతో స్థానికులు బుధవారం గమనించి త్రీటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నం


మహమ్మద్ రఫీ

చాగలమర్రి: మండల కేంద్రంలోని గుంత పాళెం వీధికి చెందిన మహమ్మద్‌రఫీ గొంతు కోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. వివరాల్లోకి వెళితే స్థానిక గుంతపాళెం వీధికి చెందిన మహమ్మద్‌రఫీ ఇంటిలోని బాత్‌రూంలో బ్లేడ్‌తో గొంతు కోసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కేరళ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న చాగలమర్రి పోలీసులు వైద్యశాలకు చేరుకుని విచారణ చేపట్టారు. ప్రాణాపాయం తప్పిందని వైద్యులు తెలిపారు. కాగా ఆత్మహత్యాయత్నానికి కారణాలు దర్యాప్తులో తెలియాల్సి ఉందని ఎస్ఐ రమణయ్య తెలిపారు.

గుండమ్మ కుటుంబానికి న్యాయం చేస్తాం


బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ

ఆదోని రూరల్: గుండమ్మ కుటుంబానికి న్యాయం చేస్తామని ఎస్పీ బిందుమాధవ్ హామీ ఇచ్చారు. బుధవారం నాగనాథహళ్లి గ్రామంలో గుండమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుమారుడు కిషోర్‌కుమార్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. గ్రామంలో తగినంత భద్రత కల్పిస్తామన్నారు. ఎస్పీ వెంట ఆదోని డీఎస్పీ శివనారాయణస్వామి, స్పెషల్ బ్రాంచ్ సీఐ నాగరాజ్‌యాదవ్ ఉన్నారు.

సాఫల్యం.. వైఫల్యం

- పెరుగుతున్న సంతానలేమి సమస్యలు
- జీవనశైలి మార్పులే కారణం
- జిల్లాలో 18 శాతం మంది బాధితులు
- పెరిగిన సంతాన సాఫల్య కేంద్రాలు
- నేడు వరల్డ్ ఐవీఎఫ్ డే

వివాహమైన ప్రతి స్త్రీ తల్లికావాలని అనుకుంటుంది. గర్భం దాల్చే సమయం కోసం ఎదురు చూస్తుంది. అయితే కొందరికి ఆ యోగ్యత లభించడం లేదు. ఇందుకు ఆమెలో అనారోగ్య కారణాలు ఉండొచ్చు. భర్తలో ఏదైనా సమస్య ఉండొచ్చు. వైద్యులను కలిసి వీటిని సరిచేసుకుని గర్భం దాల్చుకుని పండండి బిడ్డను కని తల్లిగా మారుతున్న దంపతులు చాలా మందే ఉన్నారు. ఇందులో ఐవీఎఫ్ అనేది ప్రధాన పాత్ర పోషిస్తోంది. ఈ నెల 25వ తేదీన వరల్డ్ ఐవీఎఫ్(ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్) డే. ఈ సందర్భంగా ప్రత్యేక కథనం.

కర్నూలు(హాస్పిటల్): ఇటీవల కాలంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో సంతానలేమి సమస్యతో బాధపడే వారి సంఖ్య అధికమైంది. ఒకప్పుడు వందలో ఒకరిద్దరు మాత్రమే సంతానలేమితో బాధపడే వారు. ఇప్పుడు ఆ సంఖ్య 18 శాతం వరకు ఉంటోంది. ఇలా బాధపడుతున్న వారిలో చాలా మంది వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకుని గర్భం దాలుస్తున్నారు. కొందరు మాత్రం మూఢనమ్మకాలతో కాలాన్ని వెళ్లదీస్తున్నారు. మారుతున్న కాలాను గుణంగా ఇప్పుడు వైద్యంపై అవగాహన పెరిగింది. సంతానం కోసం గతంలో హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి నగరాలకు వెళ్లి సంతాన సాఫల్య కేంద్రాలలోని వైద్యులను సంప్రదించేవారు. అలాంటి కేంద్రాలు ఇప్పుడు కర్నూలు నగరంలో కూడా ఏర్పాటయ్యాయి. అత్యాధునిక వసతులు, సౌకర్యాలతో మహానగరాల్లో అందించే వైద్యసేవలను ఇక్కడ కూడా అందిస్తున్నారు. కర్నూలు నగరంలో పదికి పైగా ఫెర్టిలిటీ కేంద్రాలు(సంతాన సాఫల్య కేంద్రాలు) ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాలకు ప్రస్తుతం ప్రతిరోజూ 30 నుంచి 40 మంది దాకా నూతన పేషంట్లు చికిత్స కోసం వస్తున్నారు.

సంతానలేమికి కారణాలు ఇవే..

ఇటీవల కాలంలో చాలా మంది యువతీయువకులు జీవితంలో స్థిరపడ్డాక వివాహం చేసుకుంటున్నారు. అమ్మాయిల సంఖ్య తగ్గిపోవడం వంటి కారణాలతో ఆలస్యంగా వివాహం చేసుకుంటున్నారు. దీంతో సంతానలేమి సమస్యలు వస్తున్నాయి. అలాగే మారిన జీవనశైలి, వ్యాయామం లేకపోవడం, స్థూలకాయం, స్త్రీలలో పీసీఓఎస్(అండాశయంలో తిత్తులు), రాత్రివేళల్లో ఆలస్యంగా నిద్రపోవడం, జంక్‌ఫుడ్ ఎక్కువగా తీసుకోవడం, మొబైల్‌ఫోన్ స్క్రీన్ ఎక్కువగా చూడటం తదితర కారణాలతో సంతానలేమి సమస్య వస్తోంది.





ఐవీఎఫ్ అంటే...

సంతానం లేని వారు చాలా మంది సంతాన సాఫల్య కేంద్రాలకు వెళ్తున్నారు. కానీ అక్కడ చేసే ఐవీఎఫ్ పద్ధతి గురించి చాలా మందికి అవగాహన ఉండదు. ఈ పద్ధతిలో బిడ్డను కనాలనుకునే దంపతులు ముందుగా దాని గురించి పూర్తిగా అవగాహన చేసుకోవాలి. అప్పుడే భవిష్యత్తులో వారి మధ్య అపోహలు తలెత్తకుండా ఉంటాయి. సాధారణంగా స్త్రీ కడుపులో బిడ్డ జన్మించాలంటే మగవారి వీర్యకణాలు ఆడవారి అండంతో కలవాలి. అప్పుడు అది పిండంగా రూపాంతరం చెందుతుంది. ఈ విషయంలో ఇబ్బందులు ఉన్నప్పుడు ఐవీఎఫ్ విధానంలో ల్యాబ్‌లో అండకణాలను సంగ్రహించడం చేసి స్పెర్మ్ నమూనాను మెరుగుపరుస్తారు. ఇంకా వివరంగా చెప్పాలంటే... ఆడవారి నుంచి అండకణాలను, మగవారి నుంచి వీర్యకణాలను సేకరించి వాటిని ల్యాబ్‌లో ఫలదీకరణం చేస్తారు.

ఐవీఎఫ్ ఎప్పుడు అవసరమవుతుందంటే...

సాధారణంగా సంతానం కలగని వారందరికీ ఐవీఎఫ్ అవసరం లేదు. ముందుగా వైద్యులను సంప్రదించి వారి సమస్యలను వివరించాలి. వారి సమస్యలను విన్న వైద్యులు సంతానం కలగకపోవడానికి అసలు సమస్య ఏమిటో గుర్తిస్తారు. దీన్ని బట్టి ముందుగా సహజసిద్ధంగా గర్భం ధరించేలా తగిన చికిత్స, ఔషధాలు అందిస్తారు. సహజ సిద్ధంగా గర్భధారణ కలిగేందుకు అవకాశం లేకుండా ఉన్న వారికి మాత్రమే ఐవీఎఫ్ చికిత్స ప్రారంభిస్తారు. ముఖ్యంగా ఆడవారిలో ఫెలోపియన్ నాళాలు మూసుకుపోయినప్పుడు, అండకణాలు తక్కువగా ఉన్నప్పుడు, అండాశయ ట్యూబ్స్ బ్లాక్ అయినప్పుడు, ఎగ్ కౌంట్ తక్కువగా ఉన్నప్పుడు, ఐయుఐ చికిత్స విఫలమైనప్పుడు, ఎక్కువసార్లు అబార్షన్లు అయినవారికి, క్యాన్సర్ రోగులకు, అలాగే మగవారిలో స్పెర్మ్ నాణ్యత తక్కువగా, పూర్తిగా లేనప్పుడు ఐవీఎఫ్ అవసరం అవుతుంది.

అపోహలు వద్దు



1978 జులై 25న ఇంగ్లండ్‌లో ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్(ఐవీఎఫ్) అనే కృత్రిమ గర్భధారణ పద్ధతిలో జన్మించిన మొదటి బిడ్డ లూయిస్ బ్రౌన్ అయ్యారు. ఈ విజయానికి గుర్తుగా ప్రతి యేడాది జులై 25న ప్రపంచ ఎంబ్రియాలజిస్టు డేగా జరుపుకుంటారు. మొదటి ఐవీఎఫ్ శిశువు జన్మించి 46 ఏళ్లు అయ్యింది. అయినా ఇప్పటికీ చాలా మందికి ఐవీఎఫ్ అంటే ఒక తెలీని భయం నెలకొంది. సంతానం కలిగేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేసి విఫలమైనప్పుడు మాత్రమే ఐవీఎఫ్ మార్గాన్ని సూచిస్తాం.

–డాక్టర్ పి. విష్ణుప్రియ, ఇన్‌ఫెర్టిలిటీ స్పెషలిస్టు, కర్నూలు

సైడ్ఎఫెక్ట్స్ ఉండవు



సాధారణంగా మహిళకు 30 ఏళ్లు దాటిన తర్వాత సంతానోత్పత్తి సామర్థ్యం తగ్గుతుంది. ఐవీఎఫ్‌లో ఎన్నో ఆధునిక పద్ధతులు, మందులు ఇప్పుడు వచ్చాయి. ప్రపంచ వ్యాప్తంగా ఈ విధానం ద్వారా ఇప్పటి వరకు 8 మిలియన్ల మందికి పైగా జన్మించారు. అయితే ఐవీఎఫ్ పట్ల ఇప్పటికీ చాలా మందికి అపోహలు ఉన్నాయి. ఐవీఎఫ్‌లోనూ ఐసీఎస్ఐ, ఐవీఎం, ఎగ్‌ఫ్రీజింగ్, స్పెర్మ్ ఫ్రీజింగ్, ఫెర్టిలిటీ ప్రిజర్వేషన్, ప్రీ ఇంప్లాంటేషన్, జనటిక్ టెస్ట్ అనే అడ్వాన్స్ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చాయి. ఐవీఎఫ్‌లో ఇచ్చే మందులతోనూ ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు.

–డాక్టర్ శిరీషారెడ్డి, ఇన్‌ఫెర్టిలిటీ స్పెషలిస్టు, కర్నూలు

టిఫా స్కానింగ్‌తో గర్భస్థ పిండం లోపాల గుర్తింపు


బాలింతలకు అవగాహన కల్పిస్తున్న ఆర్‌బీఎస్‌కే కో ఆర్డినేటర్ హేమలత

కర్నూలు(హాస్పిటల్): టిఫా స్కానింగ్‌తో గర్భస్థ పిండం లోపాలను గుర్తించవచ్చని రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం అధికారి హేమలత చెప్పారు. బుధవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలోని జిల్లా సత్వర చికిత్స కేంద్రంలో రెటీనోపతి స్క్రీనింగ్ పరీక్షల కార్యక్రమంలో భాగంగా తల్లులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భం దాల్చిన నుంచి ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా చిన్నారులు జన్మించే వరకు వారి లోపాలు బయటపడవన్నారు. ఈ సమస్యను అధిగమించి తల్లీబిడ్డల ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు ప్రభుత్వం టిఫా స్కాన్ చేయాలని నిర్ణయించి గర్భిణిల ఆరోగ్యంపై మరింత శ్రద్ధ పెట్టిందన్నారు. ఈ క్రమంలో పిండం లోపాలను గుర్తించి మందులు వాడితే వాటిని అధిగమించే అవకాశం ఉందన్నారు. ఈ టిఫా స్కాన్ 18వారాల నుంచి 22 వారాల మధ్య గర్భస్థ దశలో నిర్వహిస్తారన్నారు. పెరుగుదల లోపం, మానసిక సమస్యలు, ఆటిజం, తలసీమియా, హిమోఫీలియా, సికిల్‌సెల్ అనీమియా తదితర సమస్యలతో బాధపడుతున్న 18 ఏళ్ల పిల్లలు జిల్లా సత్వర చికిత్స కేంద్రం సందర్శించి అవసరమైన వైద్యసేవలు పొందాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ సృజన, డాక్టర్ కీర్తి, మేనేజర్ ఇర్ఫాన్, ప్రాజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

ప్రతి పనికీ ఓ ‘రేటు’

- కుంటనహాల్ పంచాయతీ కార్యదర్శిపై డీపీఓకు ఫిర్యాదు

కర్నూలు(అర్బన్): కౌతాళం మండలం కుంటనహాల్ గ్రామ పంచాయతీ కార్యదర్శి బీ నాగేష్ గ్రామంలో జరిగే అభివృద్ధి పనులకు ఓ రేటు నిర్ణయించి ఇబ్బందులకు గురి చేస్తున్నారని గ్రామ సర్పంచు పార్వతమ్మ కుమారుడు శివరామ్, గ్రామ ప్రజలు ఆరోపించారు. ఈ మేరకు వారు బుధవారం సాయంత్రం జిల్లా పంచాయతీ అధికారి టీ నాగరాజునాయుడును కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో చేసిన పనులకు రూ.1.50 లక్షలు ఇస్తేనే బిల్లులు చేస్తామంటున్నారని, ఇందుకు సంబంధించిన కాల్ రికార్డింగ్‌ను కూడా డీపీఓకు అందించామన్నారు. అలాగే 2022 నుంచి 2024 వరకు పైప్‌లైన్స్ లీకేజీ, వాల్స్ డామేజీ పనులకు కూడా బిల్లులు చేయలేదన్నారు. ప్రజలకు సౌకర్యంగా ఉండేందుకు బస్టాండ్‌లో మరమ్మతులు చేయించామని, మైనారిటీ కాలనీలో అండర్‌గ్రౌండ్ పైప్‌లైన్ వేయించామన్నారు. మొహర్రం పండుగ సందర్భంగా వేసిన వీధి దీపాల బిల్లులు చేసేందుకు కూడా ఇబ్బందులు పెడుతున్నారన్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచు కూర్చొనేందుకు కనీసం ఒక కుర్చీ కూడా కేటాయించలేదన్నారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శిపై అందిన ఫిర్యాదులపై మూడు రోజుల్లోగా విచారణ జరిపి నివేదికలను అందించాలని ఆదోని డివిజినల్ పంచాయతీ అధికారికి ఆదేశాలు జారీ చేశారు. ఆరోపణలు నిజమని తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి శిక్షణ

కర్నూలు(అగ్రికల్చర్): స్వయం ఉపాధిలో రాణించేందుకు ఉమ్మడి కర్నూలు జిల్లాలోని నిరుద్యోగ యువతకు శిక్షణ ఇస్తున్నట్లు కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ పుష్పకుమార్ తెలిపారు. కల్లూరులోని తన కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తమ సంస్థ 2003 నుంచి నిరంతరాయంగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ఈ ఏడాది 846 మందికి శిక్షణ ఇవ్వాలనేది లక్ష్యం కాగా.. ఇప్పటి వరకు 235 మందికి ఇచ్చినట్లు తెలిపారు. శిక్షణ తర్వాత స్వయం ఉపాధిలో రాణించేందుకు బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కూడా కల్పిస్తామని పేర్కొన్నారు. శిక్షణ గరిష్ఠంగా నెల రోజులు ఉంటుందని, ఈ కాలంలో భోజనంతో పాటు వసతి కూడా కల్పిస్తామన్నారు. వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

కుల ధ్రువీకరణ పత్రం ఇక ఈజీ

- జగనన్న సురక్ష కార్యక్రమంలో 2,36,663 కుటుంబాల సర్వే
- మిగిలిన కుటుంబాల వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌డేట్


కర్నూలులోని టెలికం నగర్‌లో కులం వివరాలపై సర్వే నిర్వహిస్తున్న మునిసిపల్ సిబ్బంది

కర్నూలు(సెంట్రల్): అత్యవసరంగా కుల ధ్రువీకరణ పత్రం పొందేందుకు విద్యార్థులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఈ క్రమంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి కుటుంబం కుల వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయించింది. దీంతో ప్రస్తుతం కుల ధ్రువీకరణ పత్రం చాలా సులభంగా లభించనుంది. జిల్లాలో 4,66,348 కుటుంబాలు ఉండగా.. వీటిలో 2011జనాభా లెక్కల ప్రకారం 22,71,686 మంది నివాసం ఉంటున్నారు. గత వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం జగనన్న సురక్ష పథకంలో భాగంగా 2,36,663 కుటుంబాల కులం వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయించింది. మిగలిపోయిన 2,29,685 కుటుంబాల కులం వివరాలను కూడా ఇంటింటికీ వెళ్లి సర్వే చేసి అధికారులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. మిగిలిన 9,188 అంటే 4 శాతం కుటుంబాల వివరాలను వారం రోజుల్లో సర్వే చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయనున్నారు. వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తే కుల ధ్రువీకరణ పత్రం సులభంగా పొందేందుకు అవకాశం ఉంటుంది. దరఖాస్తు చేసుకోగానే వారి వివరాలను ఆన్‌లైన్‌లో సరిపోల్చుకుని సర్టిఫికెట్‌ను జారీ చేస్తారు. ప్రజలకు సమయం, డబ్బు ఆదా అవుతాయి. గతంలో అత్యవసరంగా సర్టిఫికెట్‌ను ఇవ్వడానికి ఇబ్బందిగా ఉండేది. ఏమైనా తప్పుగా నమోదు చేసి ఇస్తే సంబంధిత ఉద్యోగులు విచారణను ఎదుర్కొని తమ ఉద్యోగాలను పోగొట్టుకోవాల్సిన పరిస్థితులు ఉండేవి. ఇక ఆ పరిస్థితులు ఉత్పన్నం కావని అధికారులు భావిస్తున్నారు.

సర్వే పూర్తికి చర్యలు

జిల్లాలో ఇప్పటికే 96 శాతం సర్వే పూర్తయ్యింది. మిగిలి పోయిన వారు స్థానికంగా అందుబాటులో లేకపోకపోవడంతోనే వివరాలు రావడంలేదు. వారం రోజుల్లో సర్వేను ముగించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– కె.మధుసూదన్‌రావు, ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్, కర్నూలు

ప్రభుత్వ స్థలం కబ్జాకు యత్నం

- టీడీపీ నాయకుల దౌర్జన్యం
- స్థల ఆక్రమణలో భాగంగా శుభ్రతా పనులు
- పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించిన ఎల్లెల్సీ అధికారులు
- ఆస్తి విలువ రూ.కోటిన్నర


ఎల్లెల్సీ స్థలాన్ని శుభ్రం చేసిన దృశ్యం


స్థలంలో నిర్మించిన కాలువ లస్కర్ల భవనం

మంత్రాలయం: అధికారంలోకి రాగానే టీడీపీ నాయకులు దౌర్జన్యాలు మొదలు పట్టారు. పాఠశాలలో వంట ఏజెన్సీలను మార్చడం, రేషన్ డీలర్‌షిప్‌లు కైవసం చేసుకోవడం.. ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లుగా తమవారిని నియమించుకోవడం.. ఇలా ఎన్నో చేశారు. తాజాగా కబ్జాలకు సైతం తెరతీశారు. రూ. కోటిన్నర విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించేందుకు పూనుకున్నారు. విషయం తెలుసుకున్న అధికారులు పోరాటానికి దిగాల్సి వచ్చింది. వివరాలివి.. మంత్రాలమం మండలం కల్లుదేవకుంట గ్రామంలోని 42ఏ2ఏ సర్వే నంబర్‌లో తుంగభద్ర ప్రాజెక్టు (టీబీపీ) శాఖకు 40 సెంట్ల స్థలం ఉంది. అదే గ్రామానికి చెందిన వారు 1956లో ఈ స్థలాన్ని టీబీపీ శాఖకు అప్పగించారు. ఈ భూమిపై సర్వహక్కులు పొందిన టీబీపీ అధికారులు 1961లో లస్కర్ల భవనం నిర్మించారు. తుంగభద్ర దిగువ కాలువ పరిధిలోని గంగవరం సెక్షన్ లస్కర్లు ఆ భవనంలో ఉంటూ సాగునీటి సరఫరా తీరును పర్యవేక్షిస్తూ వచ్చారు. గంగవరం సెక్షన్ పరిధిలోని ఇబ్రహీంపురం, చెట్నిహళ్లి, కైరవాడి, కల్లుదేవకుంట, మంత్రాలయం గ్రామాల ఆయకట్టు నిర్వహణ కొనసాగించారు. సెక్షన్ పరిధిలోని ఇద్దరు లస్కర్లు అక్కడే ఉంటూ కార్యకలాపాలు చేసేవారు. శివారు ఆయకట్టు కనుమరుగు కావడంతో ప్రస్తుతం భవనాన్ని, మిగిలిన స్థలాన్ని పట్టించుకోవడం వదిలేశారు.

కబ్జాకు యత్నం

రూ. కోటిన్నర విలువైన ఈ స్థలంపై అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుల కన్నుపడింది. ఆ స్థలం తమ పూర్వీకులందటూ కబ్జాకు ప్రయత్నాలు సాగిస్తున్నారు. రాజకీయ అండదండలతో గతంలో రెండు పర్యాయాలు కబ్జాకు యత్నించారు. మూడేళ్ల క్రితం స్థలాన్ని కై వసం చేసుకోవాలని ముఖ్య నాయకుడితో చర్చించారు. ఖాళీ స్థలాన్ని ఆక్రమించాలని నాపరాతి బండలు సిద్ధం చేసి విఫలమయ్యారు. టీడీపీ అధికారంలోకి రావడంతో తాజాగా బుధవారం స్థలాన్ని ఆక్రమించేందుకు పూనుకున్నారు. సదురు స్థలాన్ని జేసీబీతో శుభ్రం కూడా చేయించారు. విషయం తెలుసుకున్న ఎల్లెల్సీ డీఈ లక్ష్మణ్‌కుమార్ మంత్రాలయం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అలాగే రెవెన్యూ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. డీఈ ఫిర్యాదు మేరకు పోలీసులు కబ్జాకు యత్నించిన వారిని వారించారు. ఈ నేపథ్యంలో తహసీల్దార్ శ్రీధర్ మూర్తి ఆదేశాల మేరకు సర్వేయర్‌తో సర్వేకు ఆదేశించారు. రెవెన్యూ రికార్డుల మేరకు సర్వే రిపోర్టును ఎల్లెల్సీ అధికారులకు సమర్పించనున్నారు. ఈ విషయమై డీఈ లక్ష్మణ్‌కుమార్‌ను వివరణ కోరగా రెవెన్యూ రికార్డుల్లో టీబీపీ శాఖ పేరుపై స్థలం నమోదైందన్నారు. ఎవరైనా ఆక్రమించాలని చూస్తే ఫిర్యాదు చేస్తామన్నారు. ఉన్నాతాధికారుల దృష్టికి విషయాన్ని చేరవేసినట్లు తెలిపారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల పేరుతో మోసం

- 19 మంది నుంచి రూ.95 లక్షల వసూలు
- కర్నూలు నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు

కర్నూలు(సెంట్రల్): సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల పేరుతో మరో కంపెనీ బోర్డు తిప్పేసింది. 19 మంది నుంచి ఒక్కొక్కరితో రూ.5 లక్షలు చొప్పున రూ.95 లక్షలు వసూలు చేసి మోసం చేసింది. చివరకు బాధితులు తాము మోసపోయామన్న నిజాన్ని తెలుసుకొని బుధవారం కర్నూలు నాలుగో పట్టణ పోలీసులస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో సదరు కంపెనీపై పోలీసులు కేసు నమోదు చేశారు. హైదరాబాద్‌కు చెందిన ఏఓఎల్ అండ్ డెకావర్స్ అనే సాఫ్ట్‌వేర్ కంపెనీ కర్నూలులో బ్రాంచ్‌ను ఓపెన్ చేసి ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులకు వల వేసింది. రూ.5 లక్షల ఇస్తే సాఫ్ట్‌వేర్ ఉద్యోగమంటూ నమ్మబలికింది. దీంతో కర్నూలు చెందిన అనూషతోపాటు మరో 18 మంది ఒక్కొక్కరూ రూ.5 లక్షలు చొప్పున మొత్తం రూ.95 లక్షలను వారికి ఇచ్చారు. మొదట ఆన్‌లైన్ శిక్షణ పేరుతో కొన్నాళ్లు కాలం గడిపారు. తరువాత కంపెనీ ప్రతినిధులు ఉద్యోగాలపై పట్టించుకోకపోవడంతో బుధవారం అనూషతోపాటు మిగతవారు నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు నాలుగో పట్టణ పోలీసులు తెలిపారు. కాగా.. ఆ కంపెనీపై హైదరాబాద్‌లో పలు చోట్ల కేసులు ఉన్నట్లు తెలుస్తోంది.


పికెటింగ్ సిబ్బందితో వాదిస్తున్న దాడికి యత్నించిన మహిళలు

మహిళపై దాడికి యత్నం

- సకాలంలో స్పందించి రక్షించిన ఎస్ఐ
- బొమ్మిరెడ్డిపల్లెలో ఉద్రిక్తత


కుమారుడు, కుమార్తెతో బాధిత మహిళ లలిత

వెల్దుర్తి(కృష్ణగిరి): టీడీపీ నాయకులు, కార్యకర్తలు బరితెగించారు. మహిళ అని చూడకుండా ఆమెపై దాడి చేసేందుకు మూకుమ్మడిగా ఎగబడ్డారు. ఎస్ఐ సకాలంలో స్పందించడంతో బాధిత మహిళ ప్రాణాలతో బయటపడ్డారు. ఈ ఘటన బొమ్మిరెడ్డిపల్లె గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామంలో గిరినాథ్ చౌదరి హత్యానంతరం వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడైన భాస్కర్ నాయుడు, ఆయన కుమారుడు రాజేశ్, కోడలు లలిత గ్రామం వదిలి కర్నూలులో తలదాచుకుంటున్నారు. ఇంట్లో విలువైన సామగ్రి, ధ్రువపత్రాలు అన్నీ వదిలేసి వెళ్లారు. కర్నూలులో తన పిల్లలు చదువుకుంటున్నారని, ధ్రువ పత్రాలు.. ఇతరత్రా సామగ్రి తీసుకెళ్లేందుకు తనకు రక్షణ కల్పించాలని కోరుతూ లలిత ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను ఆశ్రయించి ఎస్పీ, కలెక్టర్లకు వినతి పత్రాలందించారు. ఆయా ఉన్నతాధికారుల సూచనల మేరకు పత్తికొండ డీఎస్పీ, వెల్దుర్తి సీఐ, ఎస్ఐలను పలుమార్లు తన పిల్లలతో కలిసి విన్నవించారు. గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు ఉన్నాయని, వేచి చూడాల్సిందిగా పోలీసులు ఆమెను తిప్పి పంపారు. దీంతో విసిగిన లలిత బుధవారం మధ్యాహ్నం తన కుమారుడితో కలిసి బొమ్మిరెడ్డిపల్లెకు చేరుకున్నారు. బాధిత మహిళ ఇల్లు గ్రామంలో హత్యకు గురైన గిరినాథ్ చౌదరి ఇంటి ముందే ఉండడంతో ఒక్కసారిగా ఉద్రిక్తత చోటుచేసుకుంది. హత్యకు గురైన గిరినాథ్ చౌదరి కుటుంబీకులలోని మహిళలు, మరికొందరు మహిళలు 30 మందికి మించి ఒక్కసారిగా లలితపై దాడికి యత్నించారు. దీంతో లలిత తన ఇంట్లో తలుపు వేసుకుని లోపల ఉండిపోయింది. అక్కడే పికెటింగ్ నిర్వహిస్తున్న పోలీసుల ద్వారా సమాచారమందుకున్న వెల్దుర్తి ఎస్ఐ సునీల్ కుమార్ వెంటనే గ్రామానికి చేరుకుని బాధిత మహిళ లలితను, ఆమె కుమారుడిని ఇంటిలో నుంచి బయటకు రప్పించి తన జీపులో వెల్దుర్తికి చేర్చి కర్నూలుకు బస్సులో పంపించారు.

ఆటోలో ఎత్తుకెళ్లి సుత్తితో కొట్టి

- వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై దాడి
- బాధితునికి విగిరిన కాలు

వెల్దుర్తి(కృష్ణగిరి): వైఎస్సార్‌సీపీ కార్యకర్తలే లక్ష్యంగా టీడీపీ శ్రేణులు దాడులకు తెగబడుతున్నాయి. బుధవారం రాత్రి వెల్దుర్తి పట్టణానికి చెందిన రహిమాన్‌ను ఆటోలో ఎత్తుకెళ్లి జాతీయ రహదారిలోని అమెజాన్ హోటల్ సమీపంలో సుత్తితో దాడి చేశారు. ఈ దాడిలో బాధితుడికి కాలు విరిగింది. తాను లారీకి డ్రైవర్‌గా వెళ్లేందుకు జాతీయ రహదారి–44పై ఉండటాన్ని గమనించి టీడీపీ కార్యకర్తలు గిడ్డయ్య, రమేష్‌తోపాటు మరో ఆరుగురు వీడియోలు తీస్తూ దాడికి పాల్పడినట్లు బాధితుడు రహిమాన్ తెలిపారు. అమెజాన్ హోటల్ సిబ్బంది ద్వారా కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే వారు వెల్దుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారన్నారు. సుత్తితో కొట్టడంతో కాలు విరిగినట్లు గుర్తించి వైద్యులు మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి 108లో తరలించారన్నారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాల అనంతరం దాడి జరిగే అవకాశం ఉండటాన్ని గమనించి రహిమాన్ బయట తలదాచుకున్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. మూడు రోజుల నుంచి గ్రామంలో ఉంటున్నారని, ఈ విషయం గమనించిన టీడీపీ నాయకులు కాపుకాచి దాడి చేశారన్నారు.


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రహిమాన్

ఆగస్టు 5 నుంచి శ్రావణమాస ఉత్సవాలు


ఉత్సవాల పోస్టర్లను విడుదల చేస్తున్న సబ్ కలెక్టర్ శివనారాయణ తదితరులు

కౌతాళం: అందరి సహకారంతో ఉరుకుంద ఈరన్నస్వామి శ్రావణమాస ఉత్సవాలను విజయవంతం చేద్దామని ఆదోని సబ్‌కలెక్టర్ శివనారాయణ, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ పిలుపునిచ్చారు. బుధవారం దేవాలయ ఆవరణలోని డార్మిటరీ హాల్‌లో ఉత్సవాల నిర్వహణపై అన్ని శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం ఆలయ డిప్యూటీ కమిషనర్ హెచ్.జి. వెంకటేశ్ అధ్యక్షతన జరిగింది. ఆయన మాట్లాడుతూ శ్రావణమాసం ఉత్సవాలు వచ్చే నెల 5న ప్రారంభమై సెప్టెంబర్ 3 వరకు జరుగుతాయన్నారు. కుప్పగల్ నుంచి ఎరిగేరి వరకు ఉన్న రోడ్డుకు, ఉరుకుందకు నలువైపుల ఉన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని ఆర్అండ్‌బీ ఈఈ కృష్ణారెడ్డిని ఆదేశించారు. పారిశుద్ధ్య సమస్య లేకుండా చూడాలన్నారు. భక్తుల సౌకర్యార్థం ఆదోని, ఎమ్మిగనూరు, కర్ణాటకలోని శిరుగుప్ప, రాయచూరు, బళ్లారి డిపోల నుంచి బస్సులు నడపాలన్నారు. శ్రావణమాసంలో దేవాలయం వద్ద విద్యుత్ కోత లేకుండా చూడాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. అదనపు సీసీ కెమెరాలు, కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు అలెగ్జాండర్, ట్రాన్స్‌కో ఏఈ నర్సన్న, ఎంపీడీఓ రఘునాథ్‌గుప్తా, డాక్టర్లు బాలమురళీకృష్ణ, ఇమ్మాన్యూయల్, నాయకులు రామకృష్ణారెడ్డి, సతీష్‌నాయుడు, ఆలయ ట్రస్టుబోర్డు సభ్యులు పాల్గొన్నారు.